సాక్షి అనంతపురం

ఆదివారం । 12 । జనవరి । 2025



చీనీ టన్ను రూ. 17 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.16

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.8°/18.2°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పోలీసులు కొడతారని స్టేషన్‌పై నుంచి దూకాడు!



చికిత్స పొందుతున్న మహబూబ్‌బాషా

తాడిపత్రిటౌన్: పోలీసులు కొడతారనే భయంతో పోలీస్‌స్టేషన్‌పై నుంచి ఓ వ్యక్తి కిందికి దూకేశాడు. గాయాలపాలైన అతడిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. పట్టణంలోని వరాలతోటకు చెందిన మహబూబ్ బాషాను సెల్‌ఫోన్ దొంగతనం కేసులో శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు తీసుకెళ్లారు. విచారిస్తున్న సమయంలో తనకు మూత్ర విసర్జన వస్తోందని చెప్పి మహబూబ్ బాషా బయటకు వచ్చాడు. పోలీస్‌స్టేషన్ పైకి చేరుకున్నాడు. ఈ క్రమంలోనే అరుపులు వినపడటంతో పోలీసులు వెళ్లి చూడగా.. నేలపై పడి కనిపించాడు. పోలీసులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. కాగా, పారిపోయేందుకు ప్రయత్నించి పోలీస్‌స్టేషన్‌పై నుంచి కిందకు దూకడంతో గాయాల పాలయ్యాడని పోలీసులు చెబుతుండగా, పోలీసులు కొడతారనే భయంతో పైనుంచి దూకానని బాధితుడు తెలిపాడు.

పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా



గడ్డివాముల్లో సోదా చేస్తున్న పోలీసులు

అనంతపురం: పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. పాత కేసుల్లోని నిందితుల ఇళ్లు, పశువుల పాకలు, దుకాణాలు, హోటళ్లు, ధాబాల్లో తనిఖీలు చేపట్టారు. పాత కేసుల్లో నిందితులతో పోలీసులు సమావేశమై సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ



విజయలక్ష్మి

అనంతపురం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. అనంతపురం ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారిగా ఉన్న కె.విజయలక్ష్మిని చిత్తూరు జిల్లా కలెక్టరేట్ కోనేరు రంగారావు కమిటీ (కేఆర్ఆర్‌సీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. అదే విధంగా పి.రామాంజనమ్మను అనంతపురం హెచ్‌పీసీఎల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా వారికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

సంక్రాంతులు కరువు



- ఇతని పేరు ఎస్.నజీర్. అనంతపురం నగరంలో పుట్‌పాత్‌పై రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేస్తుంటాడు. గతంలో సంక్రాంతి పండుగకు 15 రోజుల నుంచి వ్యాపారం కళకళలాడేది. గతేడాది గరిష్టంగా రోజుకు రూ. 40 వేల దాకా వ్యాపారం జరిగింది. ఈసారి ఇప్పటిదాకా ఎక్కువ అంటే రూ. 11 వేలే జరిగిందని వాపోతున్నాడు. గతంలో ఒక్కొక్కరు రెండుమూడు డ్రస్సులు కొనుగోలు చేసేవారని, ఈసారిమాత్రం ఒకటే కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నాడు. ఈయనే కాదు.. జిల్లాలోని వ్యాపారులందరూ ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కొనుగోలుదారులు లేక కళతప్పిన అనంతపురంలోని ఓ వస్త్ర దుకాణం

- జిల్లావ్యాప్తంగా మార్కెట్లు వెలవెల
- 50 శాతానికి పడిపోయిన వస్త్ర వ్యాపారాలు
- వ్యాపార వర్గాల్లో తీవ్ర ఆందోళన
- 'సంక్షేమం' లేక ప్రజల చేతుల్లో ఆడని డబ్బులు
- కళతప్పిన అన్నదాతల ఇళ్లు

అనంతపురం ఎడ్యుకేషన్: తెలుగు ప్రజల అతిపెద్ద పండుగల్లో ఒకటైన సంక్రాంతి రాబోతోంది. స్కూళ్లు, కళాశాలలకు సెలవులు రావడంతో ప్రతి ఇంట్లోనూ పిల్లల హడావుడి అంతాఇంతా కాదు. ఊరంతా సందడి సందడిగా ఉంటోంది. ఇదంతా బాగానే ఉన్నా కొనుగోలు శక్తి లేక ఆడంబరాలకు దూరంగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

గతంలో కొండంత చేయూత

గత ప్రభుత్వంలో ఐదేళ్లు నవరత్నాల పథకాలను డీబీటీ ద్వారా చెల్లింపులు చేయడంతో బడుగు, బలహీన, నిరుపేద వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున ఆర్థిక చేయూత లభించింది. దాదాపు ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం రావడంతో కొండంత అండగా ఉండేది. అన్ని వర్గాల ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ఈ కారణంగా వ్యాపారాలూ బాగా జరిగాయి.

'సంక్షేమం' దూరమై..

కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అటకెక్కాయి. దీంతో కష్టపడి సంపాదించినదంతా పిల్లల చదువులు, కుటుంబాల నిర్వహణకే సరిపోతుండడంతో పండుగలకు ప్రత్యేకంగా ఎక్కువ స్థాయిలో ఖర్చు చేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. దీనికితోడు నిత్యావసర సరుకుల నుంచి బ్రాండెడ్ వస్త్రాల దాకా అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ఈ కారణంగా అన్ని రకాల వ్యాపారాలు ఈసారి బాగా పడిపోయాయి.

50 శాతం తగ్గిన వస్త్ర వ్యాపారం

అనంతపురంతో పాటు తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుత్తి, పామిడి పట్టణాల్లో ఎక్కువగా హోల్‌సేల్, రిటైల్ వస్త్ర దుకాణాలు ఉన్నాయి. గత రెండేళ్లతో పోల్చితే ఈసారి సగానికి సగం వ్యాపారాలు పడిపోయాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకాశంలో నిత్యావసరాలు..

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో గడిచిన రెండేళ్లతో పోల్చితే నిత్యావసర సరుకుల కొనుగోళ్లు దాదాపు 45 శాతానికి పైగా తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో సంక్రాంతికి 10–12 రోజుల ముందు నుంచి పెద్ద ఎత్తున వ్యాపారాలు జరిగేవి. ఈసారి ఆ పరిస్థితి లేదు.

ఫుట్‌పాత్ వ్యాపారుల దిగాలు

అనంతపురం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,700 మంది దాకా ఫుట్‌పాత్ వ్యాపారులు ఉన్నారు. వీరిలో ఎక్కువగా చీరలు, టాప్స్, రెడీమేడ్ దుస్తులు, ప్లాస్టిక్, ఫ్యాన్సీ, లేడీస్ వేర్, చెప్పులు తదితర వ్యాపారాలు చేస్తుంటారు. పండుగ పూట వ్యాపారాలు లేక అంగళ్ల వద్ద దిగాలుగా కూర్చుంటున్నారు.

నేలచూపులు..

బంగారు, వెండి వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయి. గతంలో తులంపై ఏడాదికి గరిష్టంగా రూ. 5 వేలు పెరిగేది. గడిచిన పది నెలల్లోనే దాదాపు రూ. 20 వేలు దాకా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. కేజీ రూ. 62 వేలు ఉండే వెండి నేడు రూ. లక్ష దాకా ఉంది. ఈ ప్రభావంతో వ్యాపారాలు బాగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రియల్.. కుదేల్

పేద, మధ్య తరగతి వర్గాలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే స్థిరాస్తి రంగం కుదేలైంది. దీంతో చేతిలో డబ్బు కరువై కొనుగోలు శక్తి భారీగా పడిపోయింది. 2024–25 సంవత్సరంలో జిల్లాలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ. 469 కోట్లు లక్ష్యం కాగా.. డిసెంబరు ముగిసేనాటికి రూ. 185 కోట్ల ఆదాయమే వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

దారుణంగా పరిస్థితులు



గత ఏడాదితో పోల్చితే ఈసారి టూ వీలర్ కొనుగోళ్లు దారుణంగా పడిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 4 వేల బైకులు అమ్మకాలు జరిగేవి. ఈ ఏడాది 2 వేలు కూడా అమ్మకాలు జరగలేదు. సంక్రాంతికి కొనుగోళ్లు చేసేవారే కనిపించడం లేదు.

– మల్లికార్జున, డీలర్, అనంతపురం

ప్రజల ఆర్థిక స్థితి బాగో లేదు



సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచి జిల్లాలో వస్త్ర వ్యాపారాలు పడిపోయాయి. సంక్రాంతి పండుగ సమయంలోనూ అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ సారి 50 శాతం అమ్మకాలు తగ్గాయి. ప్రజల ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు.

– చల్లా కృష్ణరంగయ్య, క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి, అనంతపురం

రైతు ఇంటా కళ లేదప్పా

రైతు పండుగగా పిలుచుకునే 'సంక్రాంతి' కళ అన్నదాత ఇంట కూడా లేకుండా పోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డీబీటీ ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరి ఏడునెలలు పూర్తయినా నయాపైసా సాయం చేయకపోవడంతో ఆనందం కరువైపోయింది. దీనికితోడు ఇప్పటివరకూ ఉన్న పథకాలకూ మంగళం పాడేశారు. పంటలు నష్టపోయినా పరిహారం అందించలేదు. పండిన అరకొర ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వకపోవడంతో అయినకాటికి దళారులకు అమ్మేసుకుంటున్నారు. పాడిరైతులు, జీవాల కాపర్లు, పట్టు రైతులకు కూడా చేయూత కరువవడంతో పండుగ పూట పల్లెసీమలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి.

వ్యాపారాలు పడిపోయాయి



గడిచిన పది నెలల్లో జిల్లా వ్యాప్తంగా బంగారు, వెండి వ్యాపారాలు 35 శాతం తగ్గాయి. ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. గతంలో అక్షయ తృతీయ రోజున బంగారు దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కళకళలాడేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.

– మహమ్మద్ సలీమ్, గౌరవాధ్యక్షుడు, గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ అనంతపురం

తక్కువగా కొనుగోళ్లు



గతంలో పండుగలు వచ్చాయంటే పాతూరు కిటకిటలాడేది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ పెద్ద ఎత్తున వచ్చేవారు. ఈసారి సంక్రాంతి పండుగకు ఆ పరిస్థితి కనిపించలేదు. పండుగ సరుకులు చాలా తక్కువ మోతాదులో కొనుగోలు చేస్తున్నారు.

– వంకదారు వెంకటకృష్ణ, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి, పాతూరు, అనంతపురం



బోసిపోయిన అనంతపురంలోని కమలానగర్

వెంకన్న వద్దు.. బాలయ్యే ముద్దు!

- 'డాకు మహారాజ్'పై పోలీసు ఉన్నతాధికారుల అతిప్రేమ
- ప్రీరిలీజ్ ఈవెంట్ విధులకు 150 మందికి పైగా ఖాకీల కేటాయింపు
- ఏటా తిరుమలలో వైకుంఠ ఏకాదశి బందోబస్తు విధులకు జిల్లా పోలీసులు
- ఈ సారి మాత్రం నో
- బాస్ అత్యుత్సాహంపై సర్వత్రా విమర్శలు

"సార్.. నేను శబరిమలకు వెళ్లి నిన్ననే వచ్చా. కాళ్లన్నీ వాపులు వచ్చాయి. విధులకు రాలేను. దయ ఉంచి నాకు విధులు కేటాయించొద్దు"..

– ఇటీవల ఓ పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థన

"నువ్వెంత మొత్తుకున్నా కుదరదయ్యా. బాసు ఆర్డర్. 'డాకు మహారాజ్' ప్రీ రిలీజ్ ఫంక్షన్ వద్ద విధులకు హాజరు కావాల్సిందే. ఇక నీ ఇష్టం.."

– ఓ పోలీసు అధికారి స్పష్టీకరణ



డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సీఎం చంద్రబాబు బావ మరిది, సినీ హీరో బాలకృష్ణ నటించిన ఓ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌పై పోలీసు ఉన్నతాధికారులు కనబరిచిన అత్యుత్సాహం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ కార్యక్రమం కోసం వందలాది మంది పోలీసులను రెండు రోజుల పాటు బందోబస్తు విధులకు కేటాయించిన తీరు చర్చనీయాంశమవుతోంది. అనంతపురంలో ఫంక్షన్ జరిగే ప్రాంతం వద్ద సుమారు 150 మంది పోలీసులు 9వ తేదీ రాత్రి వరకూ పనిచేశారు. అయితే, తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడంతో చేసేది లేక నిర్వాహకులు సినిమా ఫంక్షన్ రద్దు చేశారు.

తిరుమలకు వెళ్లాల్సి ఉన్నా..

మూడు రోజుల క్రితం కుప్పం పర్యటనలో బాబు సేవలో తరించిన పోలీసులు... అదే రీతిలో ఇక్కడ బాలకృష్ణ సేవలో తరించేందుకు తహతహలాడారు. వాస్తవంగా ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు తిరుమలలో బందోబస్తు విధులు నిర్వర్తించేందుకు అనంతపురం పోలీసులు వెళ్లేవారు. తిరుమలలో జిల్లా పోలీసులు సమర్థవంతంగా పని చేసేవారనే పేరుంది. కానీ ఈసారి మాత్రం బాలకృష్ణ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఉండటంతో ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే తిరుపతిలో తొక్కిసలాట దుర్ఘటన చోటుచేసుకోవడం, పోలీసుల నిర్లక్ష్యంతోనే అమాయక భక్తులు ప్రాణాలు కోల్పోయారని వార్తలు వచ్చిన క్రమంలో జిల్లా పోలీసుల తీరు కూడా ఇప్పుడు చర్చనీయాంశమైంది. స్వయాన ఎస్పీ జగదీష్ వందలాది మంది పోలీసులకు ఇక్కడే బాలకృష్ణ సినిమా డ్యూటీ వేయడంతో తిరుమల బందోబస్తుకు వెళ్లలేకపోయామని కిందిస్థాయి అధికారులు చెబుతున్నారు. 'గత ఏడాది తిరుమలలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా బందోబస్తు డ్యూటీలను పకడ్బందీగా నిర్వర్తించాం. ఈ ఏడాది సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ వద్ద విధులు కేటాయించడంతో ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చింది' అని ఓ ఏఆర్ ఎస్ఐ చెప్పడం గమనార్హం. అనారోగ్యంతో బాధపడుతున్నామని, సినిమా ఈవెంటు విధులకు రాలేమని కొంతమంది పోలీసులు మొరపెట్టుకున్నా కచ్చితంగా హాజరు కావాల్సిందేనని తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఓ ప్రభుత్వ కార్యక్రమానికి కూడా గతంలో ఎప్పుడూ ఇంత ప్రత్యేక దృష్టి సారించలేదని పోలీసు వర్గాల్లోనే చర్చ జరుగుతోంది.

టికెట్లు అధిక ధరకు విక్రయిస్తే బస్సుల సీజ్

- ట్రావెల్స్ నిర్వాహకులకు డీటీసీ వీర్రాజు హెచ్చరిక
- 18 వరకూ జిల్లాలో స్పెషల్ డ్రైవ్
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయాలని ప్రయాణికులకు సూచన



వీర్రాజు, ఉపరవాణా కమిషనర్

అనంతపురం సెంట్రల్: సంక్రాంతి పండుగ సందర్భంగా అధిక ధరలకు బస్సు టికెట్లు విక్రయిస్తే సంబంధిత ట్రావెల్స్ బస్సులను సీజ్ చేస్తామని ఉప రవాణా కమిషనర్ వీర్రాజు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ నెల 18 వరకూ జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి అన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 8 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అధిక ధరలు వసూలు చేస్తే వెంటనే రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రయాణికులకు డీటీసీ విజ్ఞప్తి చేశారు.

29న వాహనాల వేలం..

రవాణాశాఖ కార్యాలయంలో సీజ్ చేసి ఉంచిన వాహనాలను ఈనెల 29న వేలం వేస్తున్నట్లు డీటీసీ వీర్రాజు తెలిపారు. సుమారు 200 వాహనాలు ఉన్నట్లు పేర్కొన్నారు. వాహన యజమానులు, ఫైనాన్షియర్లు తగిన ఆధారాలతో ఈనెల 27లోపు రవాణాశాఖ కార్యాలయానికి వచ్చి, అపరాధ రుసుం చెల్లించి వాహనాలను తీసుకెళ్లాలని, లేదంటే నిబంధనల మేరకు వాహనాలను వేలం వేస్తామని హెచ్చరించారు.

గడువులోపు ట్యాక్సులు చెల్లించాలి..

రవాణా సేవలను 'వాహన్' పోర్టల్‌లోకి మార్చిన తర్వాత మొదటి త్రైమాసిక పన్నులు కడుతున్న వాహన యజమానులు ఈ నెలాఖరు వరకూ వేచి ఉండకుండా ముందుగానే చెల్లించాలని డీటీసీ వీర్రాజు తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా రవాణాశాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకూ సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

అధికారుల చోద్యం.. తమ్ముడి భోజ్యం!



సలకంచెర్వు-చీలేపల్లి మధ్య ఉన్న వంక వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్

శింగనమల: మండలంలో ఇసుక అక్రమ తరలింపును టీడీపీ నాయకులు, కార్యకర్తలు వీడటం లేదు. సలకంచెర్వు-చీలేపల్లి గ్రామాల మధ్య ఉన్న వంక నుంచి 5 రోజులుగా నార్పల మండలానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నాడు. జేసీబీ ద్వారా ట్రాక్టర్లతో ఇసుకను తరలించి మూడు చోట్ల భారీగా డంప్ చేశాడు. అక్కడి నుంచి రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నాడు. దాదాపు 200 టన్నుల ఇసుకను కొల్లగొట్టినట్లు టీడీపీ నాయకులే అంటున్నారు. ఐదు రోజులకే దాదాపు రూ.5 లక్షల వరకు అక్రమార్జన చేసినట్లు చర్చించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.



ఇసుక తరలించడంతో ఏర్పడిన గుంతలు

అబ్బురం.. అద్భుతం

- వేడుకగా సత్యసాయి విద్యా సంస్థల 43వ క్రీడా సాంస్కృతిక సమ్మేళనం

ప్రశాంతి నిలయం: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే ప్రదర్శనలు, ఒళ్లు గగుర్పొడిచే సాహస విన్యాసాల సమాహారంగా సాగిన సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళన సంబరం అంబరమంటింది. శనివారం పుట్టపర్తిలోని సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో 43వ సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనం వేలాది మంది వీక్షకుల నడుమ నిర్వహించారు. ఉదయం ప్రశాంతి నిలయంలోని సత్యసాయి యజుర్ మందిరం నుంచి సత్యసాయి చిత్రపటాన్ని బ్రాస్‌బ్యాండ్ వాయిద్యం నడుమ హిల్ వ్యూ స్టేడియంలోని శాంతి వేదిక వద్దకు తీసుకొచ్చి అక్కడ ఏర్పాటు చేసిన సత్యసాయి సింహాసనం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయి శతజయంతి వేడుకలను ప్రస్తావిస్తూ విద్యార్థులు ప్రత్యేక బ్యానర్ ప్రదర్శించారు. ప్రశాంతి నిలయం, బృందావన్, అనంతపురం, నందగిరి క్యాంపస్‌తో పాటు సత్యసాయి వైద్య సంస్థలకు చెందిన నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్సెస్, సత్యసాయి మహిళా విద్యాసంస్థల విద్యార్థులు సత్యసాయి జగతికి చాటిన మానవతా విలువలను ప్రదర్శిస్తూ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. సత్యసాయి విద్యా సంస్థల పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ క్రీడా జ్యోతి వెలిగించారు. తొలుత జగతిపై దైవస్వరూపులు ప్రదర్శించిన దశావతారాలను ప్రదర్శిస్తూ రామాయణ, భాగవతాది పురాణ గాథలను వివరిస్తూ కలియుగంలో అవతరించిన దైవస్వరూపుడు సత్యసాయి అని సందేశాన్నిచారు. వంద అడుగుల ఎత్తయిన క్రేన్‌కు అమర్చిన ఇనుప ఊచలపై విన్యాసాలను ప్రదర్శిస్తూ సత్యసాయి శత జయంతి వేడుకల రూపాన్ని ప్రతిబింబించారు. బెలూన్ జంపింగ్, హైజంప్, లాంగ్ జంప్, బంగీ జంప్, విన్యాసాలను అత్యద్భుతంగా ప్రదర్శించారు. పరమశివుడు భక్త బృందం లయబద్ధంగా నాట్య విన్యాసాల ప్రదర్శన, ఆధునిక, సంప్రదాయ నృత్య ప్రదర్శనల సమ్మేళనంతో ఆకట్టుకుంది. కావడి నృత్యంతో చిన్నారులు మైమరిపించారు. ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు బైక్ రైడింగ్‌తో ఒళ్లు గగుర్పొడిచే సాహస విన్యాసాలను ప్రదర్శించి ఔరా అనిపించారు. బైక్‌పై గిటారు వాయించడం, అగ్ని కీలల మధ్యలోంచి బైక్ రైడింగ్, బైక్‌పై ఐదుగురు ఒకే సారి ప్రయాణించే పలు సాహస విన్యాసాలు ఉత్కంఠ రేపాయి. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలను తిలకిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



సాహస కృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థులు



జంపింగ్ విన్యాసం



ఇనుప స్తంభాలపై సాహసం

ప్రయాణం.. నరకప్రాయం

- రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయని ఆర్టీసీ అధికారులు
- అదనపు చార్జీలు భరించలేక పోతున్నామన్న ప్రయాణికులు



అనంతపురం శ్రీకంఠం సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ స్తంభించిన ట్రాఫిక్



రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో అనంతపురం బస్టాండ్‌లో వేచి ఉన్న వేలాది మంది ప్రయాణికులు

అనంతపురం క్రైం: 'ప్రయాణికుల సంక్షేమమే తమ ధ్యేయం' అనే ఆర్టీసీ నినాదం కేవలం ప్రకటనకే పరిమితమైంది. ప్రయాణికుల బాగోగులను గాలికి వదిలేసి ఆదాయమే లక్ష్యంగా ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. గత రెండు రోజులుగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులే ఇందుకు నిదర్శనం. సంక్రాంతికి కావాల్సినన్ని ప్రత్యేక బస్సులంటూ ప్రకటించిన అధికారులు.. చివరకు కాలం చెల్లిన బస్సుల్లో ప్రయాణికులను కుక్కి సాగనంపుతున్నారు. ఇది జిల్లా కేంద్రం అనంతపురంలోని దుస్థితి.

దయనీయ పరిస్థితి

సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో అనంతపురం ఆర్టీసీ బస్టాండు గత రెండు రోజులుగా ప్రయాణికులతో కిక్కిరిసి పోతోంది. ప్రయాణికుల రద్దీ కారణంగా బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ సైతం గంటల తరబడి స్తంభించిపోతోంది. బస్టాండ్‌లో తాగునీరు అందుబాటులో లేదు. మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేశారు. బస్టాండ్ ప్రాంగణంలోనే మూత్రవిసర్జన చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. శుభ్రత అనేది మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారు. చిన్నారులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. గత ప్రభుత్వంలో పండుగల సమయంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి ప్రయాణికులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ గమ్యస్థానాలకు చేర్చారు. ప్రస్తుతం ఈ పరిస్థితులు కనిపించలేదు. బస్సు బస్టాండ్‌లోకి ప్రవేశించగానే సీట్ల కోసం ప్రయాణికులు ఎగబడాల్సి వస్తోంది. బస్సులను బయటకు పంపే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతోంది. జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పూల నాగరాజు సైతం పత్తా లేకుండా పోయారు. ఇక ఆర్ఎం, డీఎంతో పాటు ఇతర కీలక అధికారులు సైతం బస్టాండు పరిసరాలను, ప్రయాణికుల సౌకర్యాలను పట్టించుకోలేదు. కలెక్టర్ సైతం బస్టాండ్ వైపుగా ఇప్పటి వరకూ కన్నెత్తి చూడకపోవడంతో సమస్యలు, అధిక ధర విక్రయాలు, అధికారుల నిర్లక్ష్యం పెచ్చుమీరి పోయాయి. ఈ బస్టాండ్‌ను బాగుపరిచేదెవరు? అనే ప్రశ్న ప్రయాణికులు వ్యక్తం చేయడం గమనార్హం.



ఇరుకైన కిటికీలోంచి లోపలకు లాగుతుండగా నొప్పి తాళలేక ఏడుస్తున్న చిన్నారి



కిటికీలో నుంచి చిన్నారిని లోపలకు పంపుతున్న దృశ్యం



బస్సు ఎక్కలేక వృద్ధుల నిస్సహాయత

క్లుప్తంగా

డిఫెన్స్ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

అనంతపురం: నగరంలోని అరుణోదయ కాలనీలో నివాసముంటున్న షేక్ జమాల్ బాషా వద్ద డిఫెన్స్ మద్యం 20 ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం. సత్యానారాయణ తెలిపారు. కొంత మంది సైనికోద్యోగుల నుంచి తక్కువ కొనుగోలు చేసి అధిక ధరకు అమ్ముతున్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.45 వేలు ఉంటుంది. తనిఖీల్లో ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు నిందితుల అరెస్టు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని అనంతపురం బైపాస్ రోడ్డు పనుల్లో నిమగ్నమైన సునీల్ కుమార్ పాండేపై దాడి చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. తాడిపత్రిలోని సీపీఐ కాలనీలో ఉంటున్న ప్రదీప్, హాజీవలితో పాటు మరో ఇద్దరు మైనర్లు జులాయిగా తిరుగుతూ వ్యసనాలకు బానిసలయ్యారు. తమ జల్సాలు తీర్చుకునేందుకు ఒంటరిగా ఉన్న వారిపై దాడి చేసి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, డబ్బును లాక్కొని వెళ్లేవారు. ఈ నేపథ్యంలో అనంతపురం బైపాస్ రోడ్డులో పనులు చేస్తున్న సునీల్‌కుమార్‌పాండేపై దాడి చేసి రాళ్లతో గాయపరిచి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు నగదును దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను శనివారం అరెస్ట్ చేసి, సెల్‌ఫోన్‌తో పాటు రూ.1,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రదీప్, హాజీబాషాను న్యాయస్థానంలో హాజరుపరిచారు. మైనర్లను బాలల పరివర్తన కేంద్రానికి తరలించారు.

ఒకే వరుసలో నాలుగు వాహనాల ఢీ



నుజ్జునుజ్జయిన కారు

పెనుకొండ రూరల్: ఒకే మార్గంలో ప్రయాణిస్తున్న నాలుగు వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళుతున్న కారు... పెనుకొండ మండలం గుట్టూరు వై జంక్షన్ వద్దకు చేరుకోగానే జాతీయ రహదారిపై స్పీడు బ్రేకర్ల వద్ద డ్రైవర్ వేగాన్ని నియంత్రించాడు. అదే సమయంలో వెనుకనే ఉన్న ఓ ట్రావెల్ బస్సు వేగంగా కారును ఢీకొంది. కారు వెళ్లి ఎదురుగా ఉన్న ఐచర్ వాహనాన్ని... ఆ ఐచర్ తన ముందు ఉన్న లారీని ఢీకొన్నాయి. ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న రవీంద్ర, నందిని, కాశీవిశ్వనాథ్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను వెలికి తీసి పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

14న కల్లూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరులో ఈ నెల 14న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు శనివారం వెల్లడించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం యువకులకు కబడ్డీ పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 13వ తేదీ లోపు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 79816 46683, 63026 55150లో సంప్రదించవచ్చు.

సాంకేతిక విద్యలో నూతన బ్రాంచ్‌లు

- జేఎన్‌టీయూ(ఏ)లో అమలుకు కసరత్తు
- క్యాంపస్ కళాశాలలో ఇప్పటికే ఆరు బ్రాంచ్‌లు
- కంప్యూటర్ సైన్స్‌లో అదనంగా ఏఐ ఏర్పాటు
- అడ్మిషన్లు పెంచుకునేలా కార్యాచరణ



అనంతపురం: సాంకేతిక విద్యలో నూతన కోర్సులను జేఎన్‌టీయూఏ అందుబాటులోకి తీసుకురానుంది. ఈ క్రమంలో నూతన బ్రాంచ్‌ల అమలుకు కసరత్తు మొదలైంది. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలకు దీటుగా అడ్మిషన్లు పెంచుకునేలా గత ప్రభుత్వ హయాంలోనే జేఎన్‌టీయూఏలో కార్యాచరణ మొదలైంది. జేఎన్‌టీయూఏ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగంలో ఆరు బ్రాంచ్‌లు ఉన్నాయి. దీనికి అదనంగా కంప్యూటర్ సైన్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు పాలకమండలి ఆమోదం తెలిపింది. పాలనాపరమైన అనుమతులు వచ్చిన వెంటనే కొత్త కోర్సు అమల్లోకి రానుంది. దీంతో జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ బ్రాంచుల్లో మొత్తం ఏడు కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. సివిల్, మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, కెమికల్, కంప్యూటర్ సైన్సెస్, కంప్యూటర్ సైన్సెస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల్లో గణనీయంగా అడ్మిషన్లు పెరిగే అవకాశముంది.

నూతనంగా బీబీఏ కోర్సు

జేఎన్‌టీయూఏలోని ఎంబీఏ కళాశాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఏపీ ఐసెట్‌లో టాప్ ర్యాంకర్లకు మాత్రమే ఇక్కడ చోటు దక్కుతోంది. టాపర్లందరూ ఈ కళాశాలనే ఎంపిక చేసుకుంటుంటారు. ఇక్కడ ఎంబీఏ పూర్తయిన తక్షణమే ఉద్యోగావకాశాలు దక్కుతున్నాయి. దీనికి తోడు కళాశాల బ్రాండ్ ఇమేజ్ కూడా మరో కారణమైంది. ఈ నేపథ్యంలో డిగ్రీ స్థాయిలోనే మేనేజ్‌మెంట్ కోర్సు అమలు చేయాలని నిర్ణయించి బీబీఏ కోర్సును అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకు సంబంధించి కూడా పాలకమండలి ఆమోదం తెలిపింది. పాలనాపరమైన అనుమతులు వస్తే బీబీఏ కోర్సు అందుబాటులోకి రానుంది.

అందుబాటులోకి 'స్వయం' కోర్సులు

సాంకేతికత పెరిగిన ప్రస్తుత రోజుల్లో వర్చువల్ లెర్నింగ్‌కు విస్తృత అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. మన ఇంటి నుంచే... మనమున్న చోటు నుంచే.. మనకు నచ్చిన కోర్సును పూర్తి చేసే అవకాశం ఉంది. ఇది కూడా పూర్తి ఉచితంగానే కావడం విశేషం. అంతేకాకుండా ఈ కోర్సులకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు ఉండడం గమనార్హం. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో స్వయం వేదిక (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ మైండ్స్) విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు సంబంధించి 'స్వయం' ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పోర్టల్‌నూ ప్రారంభించింది. దీని ద్వారా ఇంజినీరింగ్ టెక్నాలజీ మొదలు హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, బిజినెస్, లా వంటి అనేక విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేయవచ్చు. దేశంలోని టాప్ ఇనిస్టిట్యూట్ల ఫ్యాకల్టీలు రూపొందించిన సబ్జెక్టులతో బోధన సాగుతుంది.

ఎంటెక్‌లో టన్నెల్, బ్రిడ్జెస్ కోర్సుకు ఆదరణ

దేశంలోనే తొలిసారిగా ఎంటెక్‌లో టన్నెల్, బ్రిడ్జెస్ కోర్సును జేఎన్‌టీయూఏ రెండేళ్ల క్రితమే ప్రవేశపెట్టారు. టన్నెల్స్, బ్రిడ్జి నిర్మాణంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారి కొరత అధికంగా ఉంది. ఈ క్రమంలో భారత ప్రభుత్వ రోడ్డు, రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ఎంటెక్‌లో టన్నెల్, బ్రిడ్జెస్ కోర్సు నిర్వహించేందుకు ఆర్థిక చేయూత ప్రకటించింది. తొలి ఐదేళ్లు ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సు నిర్వహణకు రూ.4 కోట్ల నిధులూ మంజూరు చేసింది. కోర్సు చేస్తున్న వారు ఇప్పటికే ఇంటర్న్‌షిప్‌లో ఉండడం విశేషం.

పోరాట యోధుడు వడ్డె ఓబన్న

అనంతపురం అర్బన్: వడ్డె ఓబన్న ఓ కులానికో.. ప్రాంతానికో చెందిన వ్యక్తి కాదని, స్వాతంత్య్రోద్యమంలో అలుపెరగని యోధుడని కలెక్టర్ వి.వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కొనియాడారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో వడ్డె ఓబన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ పూలనాగరాజు పాల్గొని, వడ్డె ఓబన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడారు. వడ్డె ఓబన్న జీవిత చరిత్ర భావితరాలలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ డీడీ సుభాషిణి, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, వివిధ శాఖల అధికారులు, వడ్డెర కుల పెద్దలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న త్యాగం అజరామం

అనంతపురం సిటీ: స్వాతంత్య్ర పోరాటంలో వీరోచితంగా పోరాడిన వడ్డె ఓబన్న త్యాగం అజరామమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠంగా తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా జెడ్పీలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి అధికారులతో కలసి ఆమె ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, ఏఓలు విజయభాస్కర్ రెడ్డి, షబ్బీర్ నియాజ్, ధనుంజయ, కమ్మ నాగరాజు, శ్రీవాణి, రత్నబాబు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ఐక్యపోరాటాలకు సిద్ధంకండి

- అంగన్‌వాడీలకు పిలుపునిచ్చిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ, తదితరులు

అనంతపురం అర్బన్: సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని అంగన్‌వాడీలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్‌తో కలసి విలేకరులతో ఆమె మాట్లాడారు. ఐసీడీఎస్‌కి కేంద్రంలో బడ్జెట్ తగ్గించడం ద్వారా ప్రైవేటీకరణ విధానాలు అమలు చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సెంటర్లను కుదించేందుకు నూతన విధానం తెచ్చారన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని 2013లో ఐఎల్‌సీ తీసుకున్న నిర్ణయం నేటికీ అమలుకాలేదన్నారు. అంగన్‌వాడీలకు పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకురాళ్లు కాత్యాయిని, జ్యోతిలత, విజయ, శ్రీదేవి, రంగమ్మ, నక్షత్ర, రేవతి, ఆరుణ, పాతక్క, రామాంజినమ్మ, విజయనిర్మల, తిప్పిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పిల్లల మిస్సింగ్

- గంట వ్యవధిలోనే ఆచూకీ గుర్తింపు
- కర్ణాటకలోని ఉలిగి ఆలయం వద్ద చిన్నారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

డి హీరేహాళ్(రాయదుర్గం): ఇంట్లో తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశానికి లోనైన నలుగురు మైనర్లు ఇల్లు విడిచి వెళ్లిపోయారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వీరిలో ఓ బాలిక ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు రెండు గంటల్లోనే చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు... డి.హీరేహాళ్ మండలం జాజరకల్లు గ్రామానికి చెందిన నలుగురు మైనర్లు అల్లరి చేస్తుంటే శుక్రవారం తల్లిదండ్రులు మందలించారు. దీంతో అదే రోజు రాత్రి 2 గంటల సమయంలో ఓ బాలిక, నలుగురు బాలురు ఇల్లు విడిచి వెళ్లిపోయారు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో దిగాలు చెందారు. విషయాన్ని డి.హీరేహాళ్ పోలీసులకు శనివారం ఉదయం 11.30 గంటలకు జాజరకల్లుకు చెందిన అమరేష్ చేరవేశాడు. దీంతో అప్రమత్తమైన ఎస్ఐ గురుప్రసాదరెడ్డి, సీఐ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను రంగంలో దించారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ పుటేజీల ద్వారా మైనర్లు కర్ణాటకలోని ఉలిగి గ్రామంలో ఉన్నట్లుగా గుర్తించి అక్కడకు ఓ బృందాన్ని పంపారు. ఆలయ పరిసరాల్లో దిగాలుగా కూర్చొన్న నలుగురు పిల్లలను ఓదార్చి డి.హీరేహాళ్ పీఎస్‌కు పిలుచుకొచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ అనంతరం పిల్లలను అప్పగించారు. సమాచారం అందుకున్న కేవలం రెండు గంటల్లోనే మిస్సింగ్ కేసులో మిస్టరీని ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ రవిబాబు ప్రత్యేకంగా అభినందించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ స్టార్ రియల్ ఎస్టేట్స్. ప్లాట్లు, ఇండ్లు పొలాలు కొనబడును + అమ్మబడును. మరియు లోన్లు ఇప్పించబడును. సెల్: 9396205666, 9515271111. [A-1477]

PLOT FOR SALE

■ ATP to బళ్ళారి హైవే రోడ్డు, బ్రాహ్మణపల్లి దగ్గర, హైవేకి ఆనుకొని అప్రూవల్ ప్లాట్స్ కలవు. సెల్: 8074924603, 7780464016. [A-1467]

REAL ESTATE

■ గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్, ఇన్నర్ రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజ,మంగళగిరి,తాడికొండ,రాజధానిలోని ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్ర॥ 9948779955 [G-9877]

LAND FOR SALE

■ On Anantapur - Bangalore (NH44) Highway, near Rapthadu Mandal, Beside Gayathri Dairy Factory 65.6 Cents (0.65acres) Ph: 9490055366, 9963726464. [SCA24000981]

బాడుగకు

■ అనంతపురం నగరంలోని తపోవనం నేషనల్ పార్క్ హైవే సమీపంలో skyadobe అపార్ట్‌మెంట్ లో B-001 2BHK PLOT అద్దెకు ఇవ్వబడును.సంప్రదించండి : 9505555016. [A-379]

SERVICES

■ Stock market (Share Market) పైన అనుభవజ్ఞులైన ఫైనాన్షియల్ అడ్వైజర్ ద్వారా అవగాహన సదస్సు 12.01.2025 వ తేదీన ఉ:10 గంటలకు కల్పించబడును. వివరాలకు సంప్ర: సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ATP. 9059723829. [A-1474]

WANTED

■ EAMCET కోచింగ్ పర్పస్ కొరకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q: ఇంటర్/డిగ్రీ. జీతం: 8 నుండి10 వేలు. # నియర్ PVKK ఇంజనీరింగ్ కాలేజ్, ఆలమూరు రోడ్, ATP. 9849264241. [A-1478]

■ అనంతపురం పట్టణం ప్రజలకు ప్రముఖ SMB Groups నందు టెలికాలర్స్‌గా పనిచేయుటకు ఆసక్తి గల యువతి యువకులు కావలెను. జీ: 9000-12000 + ఇన్సెంటీవ్స్ ✆ 6301888184, 8919655881. [G-1919]

■ ATP టౌన్ ఎలెక్ట్రికల్ షాప్ లో పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ & మార్కెటింగ్ చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ గా అనుభవం కలిగిన వారు కావలెను. సెల్: 9885876615. [SCA25001148]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1266955]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30 సం.లోపు జీ: 18- 25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 91771 77244. [B-1172677]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256032]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91332 71122, 95534 61177 [B-1266958]

■ HOME FOODS నందు ఓళిగలు, రొట్టెలు, స్నాక్స్ చేయుటకు అనుభవం ఉన్న మహిళలు, హెల్పర్స్ కావలెను. # రామ్ నగర్, అనంతపురం. సెల్: 9390442350. [SCA25001054]

■ Home Tutor required for Degree student. Preferably Degree or B. Tech. Arvind Nagar. ANANTHAPUR. Cont: Cell: 9573225322, 9963368816. [SCA5001145]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ BELL INFRA ప్రాజెక్ట్ కొరకు అనుభవజ్ఞులైన మార్కెటింగ్ సిబ్బంది కావలెను. టీమ్ తో సహా వచ్చిన వారికి & హౌసింగ్ ప్రాజెక్ట్ నందు మార్కెటింగ్ చేయువారికి ప్రాధాన్యత. ప్రతి ఒక్క మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌కు ఖచ్చితమైన జీతం. ప్రారంభ వేతనం : 12,000 to 15,000. సంప్ర : 9989452444. [A-1473]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దొంగల ముఠా అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

యాడికి: చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ ఈరన్న వెల్లడించారు. యాడికిలోని వెంగమనాయుడి కాలనీకి చెందిన నరసింహులు కుమారుడు ఓబులేసు అలియాస్ అభిలాష్, రాఘవేంద్ర కాలనీకి చెందిన దూదేకుల మస్తానయ్య కుమారుడు ఖలీల్, గోపాల్ కుమారుడు చింతా గోవర్ధన్ ముగ్గురూ స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు తమ జల్సాకు అవసరమైన డబ్బు కోసం చోరీలకు తెరలేపారు. ఈ క్రమంలో యాడికి పంచాయతీ పరిధిలో వాటర్ మెన్‌గా పనిచేస్తున్న అభిలాష్ రాత్రి సమయాల్లో కాలనీలకు నీళ్లు వదులుతూ తాళం వేసి ఉన్న ఇళ్ల బయట అమర్చిన మోటార్లను ఖలీల్, గోవర్ధన్‌తో కలసి అపహరించుకెళ్లేవాడు. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం కమలపాడు రోడ్డులో ఉన్న ధాన్యం గోదాములో 10 బస్తాల జొన్నలు, సద్దలు, కొర్రలు, చందన రహదారిలో కొత్తగా నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద రెండు మోటార్లను అపహరించారు. ఆయా ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసి, 5 ప్యాకెట్ల జొన్నలు, 3 ప్యాకెట్ల కొర్రలు, 2 ప్యాకెట్ల సజ్జలు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పశుగణనలో 'అనంత' టాప్

అనంతపురం అగ్రికల్చర్: గత ఏడాది నవంబర్ మొదటి వారంలో మొదలైన 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించి అనంతపురం జిల్లా మొదటి స్థానంలో కొనసాగుతోంది. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన రాష్ట్ర స్థాయి నివేదిక స్పష్టం చేసింది. 90 శాతం ప్రగతితో అనంతపురం జిల్లా టాప్ ప్లేస్‌లో ఉండగా... 72 శాతంతో శ్రీసత్యసాయి జిల్లా 12వ స్థానంలో కొనసాగుతోంది. ఇక తిరుపతి, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, ప్రకాశం, విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, చిత్తూరు, కోనసీమ, విజయనగరం జిల్లాలు అనంతపురం తర్వాత వరుస స్థానాల్లో నిలిచాయి. పశుగణన పూర్తికి ఫిబ్రవరి 28 వరకు గడువు ఉన్నా అనంతపురం జిల్లా జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, నోడల్ అధికారి, ఏడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికతో ముందుగానే లక్ష్యం చేరుకునే పరిస్థితి కనిపిస్తోంది.

100 శాతంతో ఉరవకొండ డివిజన్

జిల్లాలోని అనంతపురం, ఉరవకొండ పశుశాఖ సబ్ డివిజన్ల కింద 31 మండలాల్లో నవంబర్ మొదటి వారం నుంచి పశుగణన చేపట్టారు. ఇందుకోసం 189 మంది ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్‌వైజర్లను నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 722 గ్రామాల్లో 5,53,432 ఇళ్లకు వెళ్లి ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, గాడిదలు, గుర్రాలు, ఒంటెలు, కోళ్లు... ఇలా అన్ని రకాల మూగజీవాల లెక్కింపు చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకూ 5,01,206 ఇళ్లు తిరిగి గణాంకాలు సేకరించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో ఉరవకొండ డివిజన్‌లో అంచనా మేరకు ఇప్పటికే 100 శాతం ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. ఇందులోనూ డి.హీరేహాళ్, బెళుగుప్ప, కళ్యాణదుర్గం, వజ్రకరూరు, గుమ్మఘట్ట, గుంతకల్లు మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో 100 శాతానికి పైగా పూర్తయింది. అనంతపురం డివిజన్ పరిధిలో 83 శాతం పూర్తయింది. ఈ డివిజన్‌లో అనంతపురం అర్బన్‌లో మాత్రమే 100 శాతం పూర్తి కాగా మిగిలిన మండలాల్లో 50 నుంచి 90 శాతం వరకు కొనసాగుతోంది. ప్రధానంగా గుత్తి అర్బన్, శింగనమల, పెద్దపప్పూరు, రాప్తాడు, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు మండలాలు పశుగణనలో కాస్తంత వెనుకబడ్డాయి. పశుగణన పూర్తయితే కాని కచ్చితమైన గణాంకాలు వెల్లడయ్యే పరిస్థితి లేదని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ గణాంకాల ఆధారంగానే పశుశాఖ ద్వారా అమలు చేసే పథకాలకు రూపకల్పన, పాడి రైతులు... జీవాల కాపర్ల సంక్షేమానికి ఆయా రాష్ట్రాలు సమగ్ర కార్యాచరణ రూపొందించనున్నాయి.



పందెం కోడి.. సంక్రాంతికి రెఢీ


పందెంలో తలపడుతున్న మేలుజాతి కోడి పుంజులు(ఫైల్)

గ్రామాల్లో మొదలైన సంక్రాంతి సందడి

- పందెం కోళ్ల కోసం పరుగులు పెడుతున్న పందెం రాయుళ్లు
- రంగును బట్టి కోళ్లకు పెరుగుతున్న డిమాండ్

రాప్తాడు: నియోజకవర్గంలో సంక్రాంతి సందడి మొదలైంది. పండుగకు మరో రెండు రోజులు ఉండగానే నియోజకవర్గంలో కోలాహలం కనిపిస్తోంది. ఏ రంగుపై ఏ రంగు కోడిని వదలాలి.. ఏది గెలుస్తుంది.. ఏది ఓడిపోతుందనే సంభాషణలు ఇప్పటి నుంచే వినబడుతున్నాయి. కోళ్ల కోసం పందెం రాయుళ్ల పరుగులు పెడుతున్నారు. కోడి కూత వినబడితే చాలు చటుక్కున ఆగి కోళ్ల యాజమానితో బేరసారాలు మొదలెడుతున్నారు. రంగును బట్టి ధర నిర్ణయించి డబ్బులు ఇస్తున్నారు. నచ్చిన పుంజును సంకలో పెట్టిసుకుంటున్నారు. పందెం రాయుళ్ల వంచన బలమైన మేత మేస్తూ కత్తి కట్టే కఠోర యుద్ధానికి సిద్ధమవుతున్నాయి.

నియోజకవర్గంలో..

గతేడాది రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో సంక్రాంతి మూడు రోజులూ అనధికారికంగా కోడి పందేలు నిర్వహించారు. పోలీసులు కోడి పందేల రాయుళ్లపై దాడులు నిర్వహించి కేసులు కూడా నమోదు చేశారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో గతేడాది సంకాంత్రి సందర్భంగా భారీ ఎత్తున పందేలు జరిగాయి. కోడి పందేలు ద్వారా రూ.లక్షలు చేతుల మారాయి. ఈ ఏడాది కూడా కోడి పందేల నిర్వహణకు పందెం రాయుళ్లు గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ శివారులోని ఉండే తోటలు, ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పందేలు నిర్వహించేందుకు అనువుగా ఉండే స్థలాలను ఎన్నుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రంగును బట్టి గిరాకీ..

రంగును బట్టి పందెం కోళ్లకు గిరాకీ పెరుగుతుండగా.. నచ్చిన కోడిని కొనుక్కునేందుకు పందెం రాయుళ్లు ఏ మాత్రం వెనుకాడటం లేదు. కాకి, పచ్చకాకి, డేగ, కాకి డేగ, నెమలి, సనసీతువా, కక్కిరి ఇలా రంగులు బట్టి ఒక్కో పందెం కోడి ధర సుమారు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పలుకుతున్నాయి. ఇవే రంగుల్లో జాతి కోళ్లు అయితే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ పలుకుతున్నాయి. అయితే రంగు నచ్చి కోడి మీద పందెం రాయుళ్ల గురి కుదిరితే చాలు ధరను పక్కనబెట్టి పుంజును పట్టుకుపోతున్నారు.

రాజ భోగమే

పండుగ సమీపిస్తుండటంతో పందెం రాయుళ్లు పందెం కోళ్లను అత్యంత జాగ్రతగా సాకుతున్నారు. ఇప్పటి వరకు తవుడు ముద్దలు, ఒడ్లు, సోళ్లు వంటివి ఆహారంగా అందించారు. పందెం కోళ్లకు, జీడి పప్పు, పిస్తా, రాగులు, చోళ్లు నువ్వులు, గంట్లు, ఉల్లి, వెల్లుల్లి వంటి విలువైన వాటిని మేతగా వేస్తున్నారు. ఒక్కొక్క కోడిపై రోజుకు రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఏడు నెలలుగా పందెం పుంజులను మేపుతున్నట్లు పెంపకం దారులు చెబుతున్నారు.

పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సంక్రాంతి పండుగ పేరు చెప్పి కొందరు పందేలకు కాలు దువ్వితే వారిపై కఠిన చర్యలు తప్పవు. గ్రామాల్లో ఇప్పటికే నిర్వాహకులపై నిఘా ఉంచాం. నిర్వాహకులు, పందెం రాయుళ్లపై చర్యలు చేపడతాం. ఇందుకు శాఖాపరమైన అన్ని చర్యలూ తీసుకున్నాం. గ్రామాల్లో ఇప్పటికే తమ సిబ్బందితో ఆటోల ద్వారా మైకుల ద్వారా ప్రచారం చేయించాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైనా పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలి.

– శ్రీహర్ష, సీఐ, రాప్తాడు

క్లుప్తంగా

పెరిగిన చెన్నకేశవుడి హుండీ ఆదాయం


హుండీ కానుకలు లెక్కిస్తున్న ఎండోమెంట్ అధికారులు

అనంతపురం కల్చరల్: నగరంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ హుండీ కానుకలను ఆలయ ఈఓ సుధారాణి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వన్నూరు స్వామి, ఆలయ అనువంశీక ధర్మకర్త వత్సలనందన్ తదితరుల ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటా ఆనవాయితీగా వస్తున్న ముక్కోటి పర్వదినం మరుసటి దినం హుండీ లెక్కింపు జరిగిందన్నారు. ఈసారి దేవుడి ఆదాయం పెరగడం ఆనందంగా ఉందన్నారు. గతంలో రూ.4,86,309 వస్తే ఈసారి రూ.5,13,901 వచ్చినట్లు తెలిపారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేకంగా ముక్కోటి ముగింపు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎండోమెంటు సిబ్బంది గురప్ప, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

అనంతపురం కల్చరల్: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక మూడవ రోడ్డులోని షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగన లక్ష్మీరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ముత్యాల ముగ్గుల పోటీలుంటాయన్నారు. విజేతలకు బహుమతులనందిస్తామన్నారు. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలని.. ఇందుకోసం ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8885375790 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

14న చిన్మయ నగర్‌లో..

రాప్తాడు: చిన్మయనగర్‌లోని గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 14వ తేదీన ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి కలిగిన మహిళలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజుల తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రెనాటి కొండా రెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి మహనంది రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ముగ్గుల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ముగ్గు పిండి, రంగులు తెచ్చుకోవాలన్నారు.

ఓబన్న ఆశయ సాధనకు కృషి


వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా

అనంతపురం: బ్రిటీష్ సైన్యంతో వీరోచితంగా పోరాడిన వడ్డే ఓబన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుందామని ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భారత స్వాతంత్య్రోద్యమానికి తొలుత నాంది పలికిన ఉయ్యాలవాడ నరసింహా రెడ్డితో కలిసి బ్రిటీష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. బ్రిటీష్ పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి వీర మరణం పొందారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, సీఐలు దేవానంద్, వెంకటేశ్, ఆర్ఎస్ఐ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

14న శోభన్ బాబు జయంతి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గాయకులు

అనంతపురం కల్చరల్: నటభూషణ శోభన్ బాబు 89వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పలువురు గాయనీ గాయకులు తెలిపారు. శనివారం ఉపాధ్యాయ భవన్ ప్రాంగణంలో శోభన్‌బాబు సేవా సమితి, ఉపాధ్యాయ కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14న జరుగనున్న శోభన్‌బాబు జయంతి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలమురళీకృష్ణ, నాగభూషణం, శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ.. శోభన్ బాబు స్వరనీరాజనం పేరిట స్థానిక కృష్ణకళా మందిరంలో ఆయన నటించిన సినిమాల్లోని మధుర గీతాలను జిల్లా వ్యాప్తంగా ఉండే గాయనీ గాయకులు ఆలపిస్తారన్నారు. కళాభిమానులందరూ విచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గౌస్‌పీర్, అమరనాథ్, నరసింహులు, చంద్రమౌళి, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యవర్గంలో చోటు


తాటిచెర్ల నాగేశ్వర రెడ్డి


నీరుగంటి నారాయణ రెడ్డి


బండి పవన్ కుమార్


దుగుమర్రి గోవిందరెడ్డి


సాకే వెంకటేష్


బాలపోతన్న

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల నియామకం
- సత్యసాయి జిల్లా కమిటీలో అనంతపురం రూరల్ నుంచి ఇద్దరికి అవకాశం

రాప్తాడు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాప్తాడు నియోజకర్గ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురికి మండల కన్వీనర్లు, జిల్లా కమిటీలో అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండలాలకు కొత్త రథసారథులు వచ్చారు. అనంతపురం రూరల్ మండలం-1 కన్వీనర్ బండి పవన్ కుమార్, రూరల్ మండలం-2 కన్వీనర్‌గా దుగుమర్రి గోవిందరెడ్డి, రాప్తాడు మండల కన్వీనర్‌గా సాకే వెంకటేష్, ఆత్మకూరు మండల కన్వీనర్‌గా జొన్నగిరి బాలపోతన్నను నియమించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లకు చెందిన నాగేశ్వరరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కట్టకిందపల్లికి చెందిన నీరుగంటి నారాయణరెడ్డిని నియమించారు. కొత్త కమిటీల్లో చోటు దక్కించుకున్న వారిని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అభినందించారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండకడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

క్రీడల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి





మాట్లాడుతున్న, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ప్రసంగిస్తున్న భారత మాజీ క్రికెటర్ స్నేహల్ ప్రధాన్

అనంతపురం: ఆర్డీటీ క్రీడా గ్రామంలో జనరలిటాట్ వాలెన్సియానా సహకారంతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆటశాల (జాతీయ క్రీడాభివృద్ధి సదస్సు) శనివారం ముగిసింది. దేశవ్యాప్తంగా 25 సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. క్రీడల భాగస్వామ్యం, క్రీడల్లో బాలికలు, మహిళల నాయకత్వం, క్రీడల ద్వారా జీవిత నైపుణ్యాల విద్య కీలక అంశాలపై చర్చించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఐసీసీ ప్రతినిధి, భారత మాజీ క్రికెటర్ స్నేహల్ ప్రధాన్ అతిథులుగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో మహిళలను భాగస్వామ్యం చేయాలనే అంశంపై ప్రసంగించారు. గ్రామీణ స్థాయిలో ప్రోత్సాహకాలు అందించడంతో పాటు రెసిడెన్షియల్ శిక్షణ అనివార్యమని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 25 కంటే ఎక్కువ సంస్థలు, అభ్యాసకులు, విద్యావేత్తలు నిపుణులు ఆటశాల కార్యక్రమం ద్వారా చేపట్టే అంశాలపై ప్రసంగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విషా ఫెర్రర్, ఆర్డీటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ ఈ.అభిషేక్, సుహీల్ టాండన్ ప్రో స్పోర్ట్స్ డెవలప్‌మెంట్, గ్రాస్ రూట్ కో-ఆర్డినేటర్ జి.వంశీకృష్ణ, టెన్నిస్ కో-ఆర్డినేటర్ విశాల విజయ్ కుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సందడి


ఆత్మకూరు: సిద్దరాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి వేడుకలు


సంబరాల్లో పాల్గొన్న రామన్ స్కూల్ టీచర్లు

ఆత్మకూరు: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ముందు ముగ్గులు వేశారు. రంగులు దిద్ది, గొబ్బెమ్మలు పెట్టి వేడుకలు జరుపుకున్నారు. పిల్లలు హరిదాసు వేషధారణలో అలరించారు. గాలిపటాలు ఎగరవేసి పండుగ ఎలా నిర్వహిస్తారో చిన్నారులకు వివరించారు.

రామన్ స్కూల్‌లో..

అనంతపురం ఎడ్యుకేషన్: సాయినగర్‌లోని రామన్ స్కూల్‌లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. టీచర్లు సంప్రదాయ దుస్తులతో హాజరుకావడంతో సంక్రాంతి శోభ ఉట్టిపడింది. అందమైన రంగవల్లులు, ఆరోగ్య రహస్యాలు దాగున్న గొబ్బెమ్మలతో పల్లె పండుగను నగరానికి తీసుకొచ్చారు. భోగిమంటల విశిష్టతను తెలియజేస్తూ సాగిన పొంగళ్లు, భోగిమంటల బొగబుగలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ రామన్, హెచ్ఎం తిరుమలదేవి సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు.

పరమేశ్వరరావు సేవలు అమూల్యం


పరమేశ్వరావు చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన ఏపీటీఎఫ్ నాయకుడు దివంగత పరమేశ్వరావు ఉద్యమ వీరుడు అని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు కొనియాడారు. శనివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన నూతలపాటి పరమేశ్వరరావు 3వ వర్ధంతి నిర్వహించారు. పరమేశ్వరరావు ఉపాధ్యాయ రంగానికి అందించిన సేవలను పలువురు కొనియాడారు. నాలుగు దశాబ్దాలకు పైగా సంఘం కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను సాధించడానికి ఏపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎస్.రఘురామిరెడ్డి, పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాయకులు సతీష్‌కుమార్, సర్దార్‌వలి, వెంకటరమణ, వన్నప్ప, రామ్మోహన్, రంగనాయకులు, లక్ష్మీనారాయణ, రవి, ఈశ్వరయ్య, గోపాల్‌రెడ్డి, రమేష్, హరి, వెంకటేశులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


చర్చి స్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

అనంతపురం కల్చరల్: వారందరూ ఒకే తరగతి గదిలో చదువుకున్నారు. ఆనందంగా అల్లరి చేశారు.. టీచర్లు గర్వపడేట్లు చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. ఎప్పుడో కలిసి మెలిసి బాల్యాన్ని పంచుకున్న పూర్వ విద్యార్థులంతా శనివారం చర్చి స్కూల్‌లో సమావేశమయ్యారు. 1977-84 విద్యా సంవత్సరాల నడుమ 1 నుంచి 7వ తరగతి చదివిన వారితో పాటూ 1977 నుంచి 87 విద్యా సంవత్సరాల నడుమ 1 నుంచి 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటల్లో మునిగితేలారు. అనంతరం ఉషా, ఇందిర, అల్లాబకాష్, భాస్కర్, వేణు తదితరుల నేతృత్వంలో ఉపాధ్యాయులందరినీ ఘనంగా సత్కరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కళ్లు, స్త్రీల వ్యాధులు, చిన్నపిల్లలు, ఎముకలు, దంత, దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర వ్యాధులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తారని పూర్వ విద్యార్థులు తెలిపారు.

నేడు పుస్తక పరిచయ సభ

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు దాసప్పగాని మనవడు, దిగువింటోడి కథలు, దేవరహస్యాలు, నీలికళ్ల నేల, హ్యూమన్ లైఫ్ (ఆంగ్లం) పుస్తకాల పరిచయ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ అక్షరీయం వారి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, రచయితలు పుస్తకాలను పరిచయం చేస్తారన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలి



ర్యాలీ చేపట్టిన ఆటో డ్రైవర్లు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి డిమాండ్ చేశారు. అనంతపురం ఆటో డ్రైవర్ల సంఘం నగర రెండవ మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి సీపీఐ కార్యాలయం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.మల్లికార్జున అధ్యక్షతన జరిగిన సభలో రాజారెడ్డితో పాటు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామని హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసి గెజిట్ 894 ప్రకారం రవాణా రంగ కార్మికులపై విధిస్తున్న అపరాధ రుసుము ఉపసంహరించాలన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లపై పోలీసులు, ఆర్టీఏ అధికారుల దాడులు ఆపాలని కోరారు. హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి, ఏఐటీయూసీ నాయకులు కృష్ణుడు, చిరంజీవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం నగర ఆటో డ్రైవర్ల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణానాయక్, సహాయ కార్యదర్శులుగా ఖాజా, నరసింహ, ఉపాధ్యక్షులుగా రఘు, బాషా, కోశాధికారిగా అస్మత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాశీవిశ్వేశ్వర శర్మ కన్నుమూత

అనంతపురం కల్చరల్: ప్రముఖ సంస్కృత పండితుడు కాశీవిశ్వేశ్వర శర్మ (56) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో కన్నుమూశారు. కోస్తాంధ్ర నుంచి వచ్చి అనంతలో స్థిరపడిపోయిన ఆయన సంస్కృత అధ్యాపకుడిగా పని చేస్తూనే జిల్లాలో భాషా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేవారు. చిన్నారుల్లో నైతిక విలువలను పెంచే భగవద్గీత పోటీలకు తరచూ సమన్వయకర్తగా, అనువాదకుడిగా వ్యవహరిస్తూ తెలుగు సంస్కృత భాషలకు, గీతా ప్రచారానికి విస్తృతంగా కృషి చేశారు. ఆయన మరణవార్త తెలియగానే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, ఆకాశవాణి ఉన్నతశ్రేణి వ్యాఖ్యాత డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, డాక్టర గొల్లాపిన్ని సీతారామ్ తదితరులు ఆయన మృతి భాషా ప్రచారానికి తీరని లోటని సంతాపం తెలిపారు. ముఖ్యంగా తిరుపతి, తిరుమల దేవస్థానాల (టీటీడీ) ఆధ్వర్యంలో జిల్లా వేదికగా జరిగే ఆధ్యాత్మిక, భాషా ప్రచార కార్యక్రమాలకు చేదోడుగా నిలిచేవారని టీటీడీ ప్రతినిధులు పురాణపండిట్ వేణు, బాబు తెలిపారు. అలాగే సాహిత్య భారతి, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు కాశీవిశ్వేశ్వర శర్మ మృతదేహానికి నివాళులర్పించారు.

ఎంపీ అవినాష్‌తో రాప్తాడు నేతల భేటీ


ఎంపీ అవినాష్‌తో వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు రూరల్: కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని శనివారం పులివెందులో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. నియోజకవర్గంలోని వివిధ అంశాలపై అవినాష్‌రెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వలంటీరు విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఓబుగారి హరినాథరెడ్డి, పార్టీ అనంతపురం రూరల్ మండలం-1, 2, రాప్తాడు, రామగిరి, చెన్నేకొత్తపల్లి, కన్వీనర్లు బండి పవన్, దుగుమర్రి గోవిందరెడ్డి, సాకే వెంకటేశు, మీనుగ నాగరాజు, డోలా రామచంద్రారెడ్డి, యువజన విభాగం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం కార్పొరేషన్: బీసీ, ఈబీసీ కులాల వారికి స్వయం ఉపాధి నిమిత్తం మంజూరు చేసే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. జనరిక్ మెడికల్ షాపుకు దరఖాస్తు చేసుకునే వారు బీ ఫార్మసీ, డీ ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. 21-60 ఏళ్ల వయసు కల్గిన వారు అర్హులని పేర్కొన్నారు. స్లాబ్-1లో రూ.1-2 లక్షల యూనిట్, రూ.2 నుంచి రూ.3 లక్షలు యూనిట్, రూ.3.5 లక్షల యూనిట్ ఉన్న వారికి 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జనరిక్ మెడికల్ షాప్స్‌కు సంబంధించి బీసీలకు 7 యూనిట్లు, ఈబీసీలకు 10 యూనిట్లు మొత్తం 17 యూనిట్లు బీసీ కార్పొరేషన్ కేటాయించిందన్నారు. అదేవిధంగా స్వయం ఉపాధిలో బీసీలకు 257 యూనిట్లు, ఈబీసీ వారికి 15 యూనిట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఈనెల 16వ తేదీలోపు https://apobmms.apcfss.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు సంఘమిత్ర సమావేశం

అనంతపురం కల్చరల్: స్థానిక అనంత కన్వెన్షన్ హాలులో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే సంఘమిత్ర సమావేశానికి అందరూ విచ్చేయాలని నిర్వాహకులు, ప్రజాగాయకుడు లెనిన్, రవికాంత్ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో పని చేస్తూ నిరంతరం సమాజ హితం కోసం పని చేస్తున్న దాదాపు 150 మంది స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్తలతో సమావేశం జరగనుంది.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

చెన్నేకొత్తపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఎవరైనా కోడి పందేలు ఆడినా.. నిర్వహించినా కఠినంగా శిక్షించడం జరుగుతుందని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలన్నారు. అలాకాకుంగా కోడి పందేలు, పేకాట తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మండల వ్యాప్తంగా పోలీసులతో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాల సూచించారు.

పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి మాజీ సర్పంచ్ లింగారెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి కడుపునొప్పి తాళలేక పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రాప్తాడు నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని మృతుడి తల్లిదండ్రులు, భార్యను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. మృతికి గల కారణాలను కుటుంబ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సానే రాజారెడ్డి, డోలా రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, ఆదిరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220732, 9912220719, 9912220724
9010223702, 9908363676, 9010567770